ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు

5★

సోమవారం 10 ఫిబ్రవరి 2025

రహదారి లేక ఇక్కట్లు...!



పొలాల మధ్య నుంచి పోచమ్మ గుడికి వెళుతున్న ప్రజలు

పాలకుర్తి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో గ్రామ దేవత అయిన పోచమ్మ తల్లి ఆలయానికి వెళ్లేందుకు సరైన రహదారి లేక పోవడంతో అమ్మవారి దర్శనానికి వెళ్లె భక్తులు పొలాల గట్లపై నడుస్తు పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామాల్లో ఎవరింట్లో ఏ శుభ కార్యక్రమం జరిగిన మొదట పూజించేది గ్రామ దేవతనే. గ్రామ దేవత ఆలయానికి ఇప్పటి వరకు సరైన రహదారి లేదు. ప్రజా ప్రతినిధులు ఆలయానికి రహదారి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మాజీ కార్పొరేటర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ 45వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమ్ము వేణు కుటుంబాన్ని ఆదివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. వేణు తల్లి రాధమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వేణు కుటుంబాన్ని పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తిప్పారపు శ్రీనివాస్, దూళికట్ట సతీష్, కల్వల సంజీవ్, కుడుదుల శివ, గడ్డం శ్రీనివాస్ ఉన్నారు.

- లారీల్లో తరలుతున్న బూడిద
- నేషనల్ హైవే పనులకు ఉపయోగం
- ఓవర్‌లోడ్‌తో తరలుతున్నా పట్టించుకోని అధికారులు
- రోడ్డుపై పడుతుండడంతో వాహనదారులకు ఇబ్బందులు



కుందనపల్లి యాష్ పాండ్ నుంచి ఓవర్ లోడ్‌తో వెళుతున్న బూడిద లారీ

కుందనపల్లి TO ఖమ్మం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలోని కుందనపల్లిలో గల ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి నిత్యం వందలాది బూడిద లారీలు ఓవర్ లోడ్‌తో వెళుతున్నా సంబంధిత రవాణా శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. లారీల నుంచి బూడిద పడుతుండడంతో వాహనదారులు, పెద్దపల్లి పట్టణంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. బూడిద కళ్లల్లో పడుతుండడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటు న్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఓవర్‌లోడ్‌తో బూడి దను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. దీంతో కాంట్రాక్టర్లు, లారీల డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డుపై బూడిద పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు.

● ఒక్కో లారీలో 30 టన్నుల వరకు...

కుందనపల్లి నుంచి ఖమ్మం వరకు దాదాపు 200 నుంచి 250 కిలోమీటర్ల దూరం లారీల్లో బూడిదను తరలిస్తున్నారు. ఒక్కో లారీలో నిబంధనలకు విరుద్ధంగా 50 నుంచి 60 టన్నుల వరకు బూడిదను తరలిస్తు న్నారు. రవాణా చార్జీల భారాన్ని తగ్గించుకునేందుకు లారీల వాహనాల బాడీని ఎత్తుకు పెంచి వాటి సామ ర్థ్యానికి మించి ఒక్కో లారీలో 20 నుంచి 30 టన్నుల బూడిదను అదనంగా తీసుకు వెళుతున్నారు. కుందన పల్లి యాష్ పాండ్ నుంచి బసంత్‌నగర్, పెద్దపల్లి కరీంనగర్ బైపాస్ హుజూరాబాద్, వరంగల్ మీదుగా ఖమ్మం జిల్లాలకు లారీలు వెళుతున్నాయి. ఎన్టీపీసీ బూడిదను నేషనల్ హైవే కోసం ఉచితంగానే ఇస్తున్నప్పటికీ, కాంట్రాక్టర్లు మాత్రం ఓవర్ లోడ్‌తో తరలిస్తున్నారు. మూడు వాహనాల్లో తరలించే బూడిదను రెండు వాహనాల్లోనే తరలిస్తున్నారు. దీంతో రోడ్లపై భారం పడుతున్నది. స్పీడ్ బ్రేకర్లు, గుంతలు, రోడ్లు దెబ్బతిన్న చోట్ల బూడిద వాహనాల్లోంచి కుప్పలు కుప్పలుగా కింద పడుతున్నది. లారీలపై కప్పాల్సిన టార్పాలిన్లు, కవర్లు సక్రమంగా కప్పక పోవడంతో బూడిద అంతా

మిగతా 8వ పేజీలో...

● గ్రీన్‌ఫీల్డ్ హైవేకు తరలింపు

రామగుండం ఎన్టీపీసీలో బొగ్గు ఆధారితంగా విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. బొగ్గు కాల్చడం వల్ల వెలువడే బూడిద కోసం కుందనపల్లి వద్ద 500 ఎకరాల్లో యాష్ పాండ్‌ను నిర్మించారు. ఇందులో పెద్ద ఎత్తున బూడిద నిల్వలు ఉన్నాయి. ఈ పాండ్ నుంచి సింగరేణికి ఉచితంగా బూడిదను తరలించుకు పోతున్నారు. భూగర్భ గనుల్లో బొగ్గును వెలికి తీసిన తర్వాత వాటిని బూడిదతో నింపుతున్నారు. జాతీయ రహదారుల నిర్మా ణంలో బూడిదను వాడుతున్నారు. సింగరేణి, జాతీయ రహదారులకు బాటమ్ యాష్‌ను వినియోగిస్తున్నారు. 2028 నాటికి యాష్ పాండ్‌లో బూడిదను ఖాళీ చేసేందుకు గ్రీన్‌ఫీల్డ్ హైవే (జాతీయ రహదారులు)ల నిర్మాణంలో బాటమ్ యాష్‌ను వాడాలని కేంద్ర ప్రభు త్వం నిర్దేశించింది. ఆ మేరకు ఎక్కడైతే జాతీయ రహదారులను నిర్మిస్తున్నారో, దానికి సమీపంలోని పవర్ ప్లాంట్‌ల నుంచి ఉచితంగా బాటమ్ యాష్‌ను తీసుకు నేందుకు వెసలుబాటు కల్పించింది. దీంతో ఖమ్మం ప్రాంతంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేల నిర్మాణాల కోసం కుందనపల్లిలో గల ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి పది మాసాలుగా బూడిదను తరలిస్తున్నారు.

నేటితో ముగియనున్న ఎమ్మెల్సీ నామినేషన్లు

- రేపు పరిశీలన
- 13న ఉపసంహరణ
- 27న పోలింగ్...
- మార్చి 3న ఓట్ల లెక్కింపు
- భారీ ర్యాలీలకు అభ్యర్థుల సన్నాహాలు

7

వరికి మొగి పురుగు...



పురుగు ఉధృతితో పెరిగిన కొంగల విహారం

8

అభివృద్ధి ఓర్వలేకనే అసత్య ఆరోపణలు

- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

8

సర్వీస్ రోడ్డుకు మోక్షమెప్పుడు..?

● రాజీవ్ రహదారిపై ఇబ్బందులు ● రెండున్నర దశాబ్దాలుగా ప్రజలకు తప్పని తిప్పలు



రాజీవ్ రహదారిపై వాహనాల రద్దీ, వన్ వేలో ఎదురెదురుగా వాహనాలు

జ్యోతినగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రామగుండం పారిశ్రామిక ప్రాంత పరిధిలోని రాజీవ్ రహదారిలో సర్వీస్ రోడ్డుకు మోక్షం లభించడం లేదు. రెండున్నర దశాబ్దాలుగా రాజీవ్ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సర్వీస్ రోడ్డు లేకపోవడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో మృతి చెందగా పలువురు క్షతగాత్రులయ్యారు. రామగుండం బీ పవర్‌హౌజ్ గడ్డ నుంచి ఎన్టీపీసీ, శ్రీనగర్‌కాలనీ మీదుగా గంగానగర్ వరకు విస్తరించిన రాజీవ్ రహదారి వెంట పూర్తిస్థాయిలో సర్వీసు రోడ్డు నిర్మించ లేదు. ఎన్టీపీసీ నుంచి గోదావరిఖని వరకు అక్కడక్కడ కొంత దూరం సర్వీస్ రోడ్డు మాత్రమే నిర్మించారు. రాజీవ్ రహదారి నిర్మాణ సమయంలో రామగుండం పరిధిలోని ఎన్టీపీసీ, గోదావరిఖనిలో అండర్ పాస్, వెహికిల్ అండర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరిగాయి. అయితే ఆ సమయంలో ప్రధాన రహదారిలో ఉన్న ఇక్కడి భవనాల యజమానులు, వ్యాపారులు వీయూపీ(వెహికిల్ అండర్ పాస్), వీయుబీ (వీ అండర్‌స్టాండ్ యువర్ బిజినెస్)ల నిర్మాణాన్ని వ్యతిరేకించారు. అప్పటి ప్రజాప్రతినిధులు దీనికి మద్దతునిచ్చారు. ఇక వీయూపీ, వీయూబీలు లేకుండా సర్వీస్ రోడ్డు నిర్మించే విషయంలో అదే భవనాల యజమానులు అభ్యంతరాలు చెప్పారు. తమ భూములు ఇచ్చే విషయంలో కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో 10 కిలోమీటర్ల పరిధిలో సర్వీస్ రోడ్డును పాక్షికంగా నిర్మించాల్సి వచ్చింది. ఈ క్రమంలో సర్వీస్ రోడ్డు నిర్మాణం విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదు.

నిత్యం రోడ్డు ప్రమాదాలు..

సర్వీస్ రోడ్డు లేని కారణంగానే నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన పట్టణం రాజీవ్ రహదారికి ఆనుకొని ఉండడం, ఈ ప్రాంత ప్రజలు తప్పని సరిగా రాజీవ్ రహదారిపైనే వెళ్లాల్సి వస్తుంది. దీంతో నిత్యం రద్దీగా ఉండే రాజీవ్ రహదారిపై ట్రాఫిక్ వ్యవస్థ గజిబిజిగా తయారైంది. ఒకే వైపు(వన్ వే) వెళ్లేందుకు అనువుగా ఉండాల్సిన రోడ్డు, రెండు వైపులా వాహనాలు వెళ్లే రహదారిలా మారింది. వన్ వేలో ఎదురెదురుగా వాహనాలు రావడంతో నిత్యం యాక్సిడెంట్లు జరుగుతున్నాయి.

ప్రభుత్వాలు మారినా మారని వైనం..

ప్రభుత్వాలు మారినప్పటికీ సర్వీస్ రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి ముందు 2009లో అప్పటి జిల్లా యంత్రాంగం రామగుండంలో రాజీవ్ రహదారి వెంట సర్వీస్ రోడ్డు నిర్మించేందుకు ప్రయత్నించింది. అప్పటి మహిళా జాయింట్ కలెక్టర్ సర్వీస్ రోడ్డు నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఆ జాయింట్ కలెక్టర్ బదిలీ కావడంతో మళ్లీ మొదటికొచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మరోసారి సర్వీస్ రోడ్డు విషయంలో రాజకీయ ప్రకటనలు వచ్చాయి. 2018లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన కోరుకంటి చందర్ సర్వీస్ రోడ్డు నిర్మించి తీరుతానని హామీ ఇచ్చారు. రెండు, మూడు సార్లు సర్వే చేసినప్పటికీ ముందడుగు పడలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఎన్నికల సమయంలో సర్వీస్ రోడ్డు విషయంలో హామీ ఇచ్చారు. పూర్తిస్థాయిలో సర్వీస్ రోడ్డును నిర్మిస్తానని ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత కూడా మక్కాన్‌సింగ్ హామీ ఇస్తున్నారు. సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మించాలి

- బలరాం ప్రసాద్, అన్నపూర్ణకాలనీ



ఎన్టీపీసీ పరిధిలో కచ్చితంగా సర్వీస్ రోడ్డు నిర్మించాలి. రోడ్డు లేకపోవడంతో అనివార్యంగా రాంగ్ రూట్‌లో వాహనాలు నడపాల్సి వస్తుంది. దీని వల్ల యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వం చొరవ తీసుకొని సర్వీస్ రోడ్డును పూర్తి చేయాలి.

ప్రమాదాల బారి నుంచి కాపాడాలి

- ఎండి.రహీం, మల్యాపూర్



రోడ్డు ప్రమాదాల బారి నుంచి ఈ ప్రాంత ప్రజలను కాపాడాలి. రాజీవ్ రహదారి పరిధిలో సర్వీస్ రోడ్డు లేని కారణంగా ప్రమాదాల సంఖ్య పెరిగింది. రోజు ఏదో ఒక చోట యాక్సిడెంటు జరుగుతోంది. కలెక్టర్, ఎమ్మెల్యే కృషి చేసి రోడ్డు నిర్మించేలా చూడాలి.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



3కే రన్‌లో పాల్గొన్న యువతీ యువకులు

కళ్యాణ్‌నగర్/జ్యోతినగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. ఆదివారం ఎన్టీపీసీలో ట్రు ఫిట్ జిమ్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా 3కే రన్ నిర్వహించారు. ఈ రన్ గోదావరిఖని చౌరస్తా వరకు సాగింది. అనంతరం జరిగిన సభలో కందుల సంధ్యారాణి మాట్లాడుతూ ఆధునిక జీవన శైలిలో ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని, ఆరోగ్యమే అసలైన సంపద అని, యువత, మహిళలు, ఉద్యోగస్థులు నిత్యం వ్యాయామం, నడక, జిమ్ అలవాటు చేసుకోవాలన్నారు. యువతకు సరైన దిశా, నిర్దేశం చేస్తేనే బలమైన సమాజం ఏర్పడుతుందని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించి యువతను డ్రగ్స్ నుంచి కాపాడాలని కోరారు. జిమ్ నిర్వాహకులు ఝకీల్, ముజ్మిల్, ఫక్రుద్దీన్, దాసరి రాయలింగు, సుధాకర్, రాఘవరెడ్డి, కిరణ్, వినయ్, సమీర్, మారుతి, మంజు, ఆత్రేయ, అంజలి, నిలోఫర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం



శాస్త్రినగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్ , ఫిబ్రవరి 9: (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తానని, గత ఎన్నికలలో వారికి ఇచ్చిన హామీ మేరకు శాస్త్రినగర్‌లో భూమి బదలాయించి వారి రాకపోకలను సుగమం చేశానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. శాస్త్రినగర్ వద్ద గల పోలీస్ ల్యాండ్‌తో శాస్త్రినగర్ ప్రజలకు ఇబ్బంది ఏర్పడిందని కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ సాయిరి పద్మ మహేందర్‌లు గత ఎన్నికలలో విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే పోలీస్ వారికి వేరే చోట భూమి బదలాయించడంతో ఆదివారం ఆత్మీయ కృతజ్ఞత సభను ఏర్పాటు చేసి ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు సర్వే నంబర్ 228లో ఉన్న 30 గుంటల భూమిని 229 సర్వే నంబర్‌లోకి బదిలీ చేయించినట్లు తెలిపారు. దాంతో రాకపోకలను పునరుద్ధరించడానికి రోడ్డు ఏర్పాటు చేసుకోగా ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.250 కోట్లతో శాస్త్రినగర్‌లో దశల వారీగా పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అన్నయ్య, మార్కెట్ చైర్మన్ ప్రకాష్‌రావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, కేడీసీసీబీ డైరక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, సాయిరి పద్మ మహేందర్, అబ్బయ్యగౌడ్, సతీష్, బిరుదు క్రిష్ణ, పన్నాల రాములు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చలో హైద్రాబాద్ పోస్టర్ల ఆవిష్కరణ

ఫైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): చలో హైద్రాబాద్ కార్యక్రమ పోస్టర్, కరపత్రాలను ఆదివారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో న్యూడెమోక్రసీ నాయకులు ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 20న ఆందోళన చేపట్టనున్నట్లు జిల్లా నాయకుడు బీ అశోక్ తెలిపారు. ఎన్నికల ప్రచార సమయంలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా అమలు మాత్రం జరగలేదని తెలిపారు. హామీలను అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు న్యూడెమోక్రసీ దశల వారీ ఉద్యమాలు చేపట్టనున్నట్లు అశోక్ తెలిపారు. శారద, మేరీ, పొన్నగంటి రాములు, లక్ష్మీ, లింగయ్య, అనసూయ, సంజీవ్, సదానందం, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ



జూలపల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధ క్షేత్రమైన భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం జాతర ఘనంగా కొనసాగింది. వివిధ జిల్లాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. అలాగే మల్లన్నకు కోడె మొక్కులు, ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి మొక్కులు సమర్పించారు. గుంపుల మానేరు సమీపంలో ఉన్న రామాభద్రాలయాన్ని వరంగల్ మాజీ ఎమ్మెల్యే సిరిసిల్ల రాజయ్య సందర్శించారు. అనంతరం ఆలయంలో అర్చనలు నిర్వహించారు. ఆలయ చరిత్రను మాజీ ఎమ్మెల్యేకు వివరించారు.

కమాన్‌పూర్ మండలంలో...

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూలపల్లి గ్రామంలోని మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఆదివారం అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొన్నారు. ఆలయ ఆవరణలో పట్నాలువేసి, బోనాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలతో హోరెత్తించారు. మండలంతోపాటు దూరప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రతీ బుధ, ఆదివారాల్లో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మల్లికార్జున స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు.

ఎన్టీపీసీలో ఘనంగా ఆనంద మేళా



ఆనంద మేళాను ప్రారంభిస్తున్న సీజీఎం చందన్ కుమార్

జ్యోతినగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ఆనంద మేళా 2025 ఆదివారం రాత్రి ప్రారంభమైంది. ఎన్టీపీసీ మహాత్మ గాంధి స్టేడియంలో ఏర్పాటు చేసిన మేళాను ప్రాజెక్టు సీజీఎం చందన్ కుమార్ సామంత ప్రారంభించారు. ఈ సందర్భంగా మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సీజీఎం పరిశీలించారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఇస్తున్న ఉత్కర్ష్ స్కాలర్‌షిప్ చెక్కులను సీజీఎం విద్యార్థులకు పంపిణీ చేశారు. అ లాగే ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న పేద విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఆనంద మేళా సందర్భంగా ఆదిలాబాద్‌కు చెందిన గోండు కళాకారులు గుస్సాడి నృత్యం ప్రదర్శించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన ఇంద్రజాల కళాకారుడు అలీ మేజిక్ ప్రదర్శించాడు. ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద మేళా సోమవారం కొనసాగుతుంది. పలువురు అధికారులు, దీప్తి మహిళా సంఘం సభ్యులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థికి ఉత్కర్ష్ స్కాలర్‌షిప్ చెక్కు అందిస్తున్న సీజీఎం

అంతర్జాతీయ కరాటే పోటీలో బంగారు పతకం

గంగాధర, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థిని అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ వారుణి తెలిపారు. ఈ నెలలో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఇంటర్ నేషనల్ ఓపెన్ కరాటే పోటీలను నిర్వహించారు. పాఠశాల నుంచి లగిషెట్టి శరణ్య పాల్గొని అండర్ 14 విభాగం స్పారింగ్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి బంగారు పతకం, 40 కిలోల విభాగంలో కటాస్‌లో ద్వితీయ స్థానం పొందినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి అంతర్జాతీయ కరాటే క్రీడల్లో పాఠశాల కీర్తిని చాటి బహుమతులు పొందిన శరణ్యను సన్మానించారు. కార్యక్రమంలో కరాటె మాస్టర్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బంగారు పతకం సాధించిన విద్యార్థిని శరణ్య

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. తలనీలాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన చర్యలు చేపట్టారు.


స్వామి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ప్రైవేటు డిగ్రీ కళాశాలలో షార్ట్‌సర్క్యూట్

- కాలిపోయిన కంప్యూటర్లు, ఫర్నీచర్


కాలిపోయిన పరికరాలను పరిశీలిస్తున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి కంప్యూటర్లు, ఫర్నిచర్ కాలిపోయాయి. కళాశాలలో నుంచి మంటలు రావడాన్ని గమనించిన వాచ్‌మెన్ అప్రమత్తమై నిర్వాహకులకు సమాచారం అందించాడు. అక్కడకు చేరుకున్న వారు అగ్నిమాపక సిబ్బందికి విషయం చేరవేశారు. హుటాహుటిన చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పింది. ఘటనలో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని నిర్వాహకులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి చేరుకుని ప్రమాదం తీరును అడిగి తెలుసుకున్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ రంగాపూర్ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతిచెందిన మహిళకు సుమారు 32-35 మధ్య వయసు ఉంటుందని, మృతురాలు మతిస్థిమితం లేని స్థితిలో ఉందన్నారు. శనివారం రాత్రి ప్రమాదం జరగగా మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురిలో భద్రపరిచినట్లు ఎస్‌ఐ స్వామి తెలిపారు. సంఘటనపై ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

వలస కార్మికుడి ఆత్మహత్య

గంగాధర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒద్యారం క్వారీలో పనిచేస్తున్న వలస కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన రాజ్‌కుమార్ పటేల్(25) కొద్దిరోజులుగా ఒద్యారం గ్రానైట్ క్వారీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పది రోజుల నుంచి పనిచేయడం ఇష్టలేక తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నట్లు తెలిపినా వారు పనిలోనే ఉండాలని సూచించారు. పని చేయడం ఇష్టంలేక తల్లిదండ్రులు ఇంటికి రావద్దన్న మాటలకు మనస్తాపంతో గ్రానైట్ క్వారీ సమీపంలో ఆదివారం చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి తమ్ముడు కన్యలాల్ పటేల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


అజయ్(ఫైల్)

ధర్మారం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని ఖానంపల్లి గ్రామానికి చెందిన గడ్డం అజయ్ (22) ఓ అమ్మాయిని ప్రేమించగా ఆమె పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో మనస్తాపానికి లోనై అజయ్ గతనెల 29న పురుగుల మందు తాగాడు. చికిత్సనిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఆదివారం మరణించాడు. అజయ్ తండ్రి గడ్డం ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మంథనిరూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారం వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఏపీ-20 వై 7659 ఆటో ట్రాలీలో 20సంచుల్లో తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం తరలిస్తున్న డ్రైవర్ కర్రు సమ్మయ్యను విచారించగా బిట్టుపల్లి గ్రామానికి చెందిన కాసు రాజు, ఓదెలు చెప్పిన విధంగా బియ్యాన్ని మహారాష్ట్రలోని సిరోంచకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో గంజాయి విక్రయిస్తున్న శాస్త్రినగర్‌కు చెందిన వేముల శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. వేముల శ్రీనివాస్ గోదావరిఖనిలోని ఓ హోటల్లో పని చేస్తున్నాడు. అతని చిన్న కుమారుడు చంద్రప్రకాష్ మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో పని చేస్తున్నాడు. అతని ద్వారా గంజాయి సుల్తానాబాద్‌లోని శ్రీనివాస్ ఇంటికి చేరవేస్తున్నాడు. దానిని శ్రీనివాస్ ఈ ప్రాంతంలోని వలస కూలీలకు, యువతకు చిన్న చిన్న ప్యాకెట్లు చేసి విక్రయిస్తున్నాడు. పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా శ్రీనివాస్ గంజాయితో పట్టుబడ్డాడు. గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్టు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని మెడికల్ షాపులో దొంగతనానికి పాల్పడ్డ దొంగను పోలీసులు పట్టుకున్నారు. శాస్త్రినగర్‌కు చెందిన వేముల భవాని ప్రకాష్ అలియాస్ బబ్లూ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నాడని ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. శనివారం శివశంకర్ మెడికల్ స్టోర్ షటర్ కు వేసి ఉన్న తాళాన్ని పగులకొట్టి లోపలికి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.24 నగదు, సెల్ ఫోన్‌ను చోరీ చేశాడన్నారు. నిందితుడిని పట్టుకుని అతని వద్ద నుంచి రూ.18 వేల నగదు సెల్ ఫోన్ రికవరీ చేశామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు.



బీర్‌పూర్‌లో అలజడి

బీర్‌పూర్ గ్రామం

- వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో.. మావోయిస్టు అగ్రనేత గణపతి స్వగ్రామంలో ఆందోళన
- ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని గుబులు

బీర్‌పూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లో జరుగుతున్న వరస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ కార్యదర్శి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ముప్పాల లక్ష్మణ్‌రావ్ అలియాస్ గణపతి స్వగ్రామం బీర్‌పూర్‌లో అలజడి నెలకొంది. ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుం దోనని జగిత్యాల జిల్లా బీర్‌పూర్ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన బల్మూరి నారాయణరావ్ అలి యాస్ క్యాడర్ ప్రభాకర్ 2024 డిసెంబరు 23న అరెస్టు అయ్యాడు. 2025 జనవరి 21న ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లో గరియాబంద్ జిల్లా కుల్హాడీఘాట్ అటవీప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి ప్రతాప్ రెడ్డి అలి యాస్ చలపతి అలియాస్ జయరాం(62)తో పాటు ఒడిశాలో మావోయిస్టు పార్టీ కీలకనేత మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ(ఎస్‌జడ్‌సీ) సభ్యుడు గుడూలతో పాటు మరికొంతమంది మావోయిస్టులు మృతి చెందారు.ఈ వార్త తెలిసిన గ్రామస్థులు గణపతి ఎలా ఉన్నాడో, ఎక్కడ ఉన్నాడో అని నిత్యం చర్చించుకుంటున్నారు.

• ఉపాధ్యాయ వృత్తి నుంచి ఉద్యమం వైపు..

మావోయిస్టు అగ్రనేత ముప్పాల లక్ష్మణ్‌రావ్ అలియాస్ గణపతి జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలో ముప్పాల గోపాల్‌రావ్-శేషమ్మ దంపతులకు 1949వ సంవత్సరం జూన్16న నాలుగో సంతానంగా జన్మించాడు. గణపతి అన్నయ్య నర్సింగారావ్ హైదరాబాద్‌లో ఉండగా తమ్ముడు రాంచందర్‌రావ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ మృతి చెందాడు. గణపతికి ఇద్దరు అక్కలు ఉన్నారు. గణపతికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రాగినేడుకు చెందిన విజయతో వివాహం జరగ్గా కుమారుడు శ్రీనివాసరావ్ ఉన్నాడు. గణపతి విదేశాలకు వెళ్లి వచ్చి ఇంజనీరింగ్ ఉద్యోగం చేస్తున్నాడని తెలిసింది. గణపతి మూడో తరగతి వరకు బీర్‌పూర్‌లో చదివిన అనంతరం కరీంనగర్ జిల్లాలోని అమ్మమ్మ గ్రామమైన గంగిపెల్లిలో 7వ తరగతి వరకు చదివాడు. జగిత్యాలలో 7వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యను అభ్యసించాడు. కరీంనగర్‌లోని రాజరాజేశ్వర కాలేజీలో బీఎస్సీ పూర్తి చేశాడు. 1970లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించి కరీంనగర్ జిల్లా లోని ఎలగందులలో మొదట పోస్టులో చేరారు. ఆ తరువాత ఎలిగేడులో కొంతకాలం పనిచేశాడు. అనంతరం రుద్రంగికి బదిలీపై వెళ్లిన ఆయనను బీఈడీ ట్రైనింగ్ నిమిత్తం వరంగల్ జిల్లాకు పంపగా పంపగా అక్కడ మావోయిస్టు నాయకులు నల్లా ఆదిరెడ్డి మరియు కొండపల్లి సీతారామయ్యలతో పరిచయం ఏర్పడింది. చివరికి వారి భావాలకు ఆకర్షితుడై మావోయిస్టు ఉద్యమంలో చేరాలని నిర్ణయించుకున్నాడు. అతడు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్-లెనినిస్ట్) పీపుల్స్ వార్ గ్రూప్ యొక్క ప్రారంభ సభ్యులలో ఒకడు. ఇప్పుడు విలీనమైన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు) అని పిలువబడే పార్టీకి కేంద్రకమిటీ ప్రధాన కార్యదర్శి స్థాయికి గణపతి అంచెలంచెలుగా ఎదిగాడు. గణపతి లొంగిపోవాలని 2013లో బీర్‌పూర్‌లో అప్పటి ఎస్పీ శివకుమార్ ఆధ్వర్యంలో అంతర్మథనం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామంలో బస చేశారు.

చిన్నప్పుడు ఎవరినీ ఏమీ అనేవాడు కాదు

-బింగి నర్సయ్య, బీర్‌పూర్



చిన్నపుడు మేము చదువుకునే సమయంలో లక్ష్మణ్‌రావ్ అందరితో మంచిగానే ఉండేవాడు. ఎవరితో కొట్లాడేవాడు కాదు. మాతో పాటు హన్మండ్ల గుడి వద్ద ఉన్న బడిలో చదువుకున్నాడు. లక్ష్మణ్‌రావ్ నాకంటే ఒక్క తరగతి పెద్ద. అందరం కలిసి ఆడుకునే వాళ్లం.

● బీర్‌పూర్‌లో పోటాపోటీ స్తూపాలు


పోలీసులు నిర్మించిన శాంతిస్తూపం

పోలీసుల చేతుల్లో మావోయిస్టులు మృతిచెందారని అప్పట్లో మావోయిస్టు దళాలు జగిత్యాలకు వెళ్లే బస్టాండ్ వద్ద ఎర్ర స్తూపాన్ని నిర్మించారు. మావోయిస్టుల చేతిలో అమరులైన 43 మంది పేరు మీద పోలీసులు ధర్మపురి వెళ్లే బస్టాండ్ వద్ద శాంతిస్తూపాన్ని నిర్మించారు. ఉమ్మడి సారంగాపూర్ మండలంలో 22 గ్రామాలు ఉండేవి. 11గ్రామాలతో గణపతి స్వగ్రామాన్ని బీర్‌పూర్ మండల కేంద్రంగా ప్రకటించారు. ప్రస్తుతానికి బీర్‌పూర్ గ్రామంలో మావోయిస్టు ప్రభావం పూర్తిగా తగ్గిపోవడంతో యువకులు ఆర్మీ, ఇండియన్ నేవీ, సివిల్ పోలీస్ కొలువులు సాధిస్తున్నారు. గ్రామంలో సుమారు 15 మంది వరకు పోలీస్ శాఖలో ఉద్యోగాలు చేస్తున్నారు.

పారుతున్న బిక్కవాగు.. రైతుల్లో ఆనందం

- యాసంగి పంటలకు ఇబ్బంది ఉండదంటున్నరైతులు - నాలుగు వేల ఎకరాలకు ప్రయోజనం


ఇల్లంతకుంటలో ప్రవహిస్తున్న బిక్కవాగు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అనంతారం ప్రాజెక్టు దిగువన ఉన్న బిక్కవాగు ప్రవహిస్తుండటంతో యాసంగి పంటలకు ఇబ్బంది తొలగిపోయిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.93 టీఎంసీల నీరు ఉంది. దీంతో స్థానిక రైతుల వినతుల మేరకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులతో మాట్లాడి అనంతారం ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయించారు.

ప్రాజెక్టు నిండి మత్తడి దూకడంతో దిగువన ఉన్న బిక్కవాగు పారుతోంది. ఓవైపు ఫీడర్ ఛానల్ ద్వారా రహీంఖాన్‌పేట గ్రామంలోని సింగరాయకుంటకు నీరు చేరుతూ, మరోవైపు దిగువ ప్రాంతానికి నీరు వస్తోంది. జంగమరెడ్డిపల్లె, అనంతారం, ఇల్లంతకుంట, వంతడుపుల, నర్సక్కపేట, జవారిపేట గ్రామాల్లోని దాదాపు నాలుగు వేల ఎకరాలకు ప్రయోజనం కలుగుతుంది. బిక్కవాగు సమీపంలోని రైతులందరు వరిపంటను సాగుచేశారు. వరిలో కలుపు తీసి రెండవసారి ఎరువులు చల్లుతున్నారు. ప్రస్తుత దశలో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని, ఇలాంటి సమయంలో బిక్కవాగు పారుతుండటం వల్ల ఇబ్బందులు తొలగినట్లేనని, అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను మరింత పెంచితే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

● యాసంగి పంటకు ఇబ్బంది తొలగిపోతుంది..

- దయ్యాల కనుకయ్య, రైతు ఇల్లంతకుంట



బిక్కవాగు పారుతుండటంతో యాసంగి పంటకు ఎదురయ్యే ఇబ్బంది తొలగిపోతుంది. వరిచేను కలుపుతీయడం వల్ల నీరు ఎక్కువగా తాగుతుంది. ఎండల వల్ల బావులు, బోర్లలో నీరు రోజురోజుకు తగ్గుతోంది. పదిహేను రోజుల పాటు వాగుపారితే రైతులకు ఉపయోగం ఉంటుంది. బిక్కవాగు పారితే ఎనిమిది గ్రామాల రైతులు లాభపడతారు. బిక్కవాగులోని ముళ్లపొదలను తొలగించి, వ్యర్థాలను వేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

● నీటి విడుదలతో ప్రయోజనం..

- పారిపెల్లి మధుసూదన్‌రెడ్డి, రైతు జంగమరెడ్డిపల్లె



అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి అనంతారం ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయడం వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ప్రాజెక్టు దిగువన ఉన్న బిక్కవాగు పారుతుండటం భూగర్భ జలాలు పెరుగుతాయి. రైతుల పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ నీటిని విడుదల చేయించడం సంతోషకరం. ఎక్కువ మొత్తంలో నీటి విడుదల చేసినట్లయితే మరింత ప్రయోజనం కలుగుతుంది.

ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్ట్

ఐదు ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం -వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


నిందితులను అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో వరుసగా చోరీలకు పాల్పడుతున్న ద్విచక్ర వాహనాల దొంగల ముఠాను ఆదివారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు త రలించారు. జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాల ను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన జక్కుల గోపాల్, సింగంరాజు, నేరెళ్ల నరేష్, సంపతి కుమారస్వామి, బుర్రరాజేందర్ జల్సాలకు అలవాటు పడి ఒక ముఠాగా ఏర్పడ్డారు. జక్కుల గోపాల్‌కు చెందిన ఓ కారులో రాత్రి సమయాల్లో తిరుగుతూ ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్నారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని పెంబట్ల గ్రామంలో గత డిసెంబరులో బైక్ దొంగిలించారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని వెల్గనూర్ గ్రామంలో మరో బైక్‌ను, చిన్నబెల్లాల్ గ్రామంలోని ఇంటి ముందు పార్కు చేసిన మరో బైక్‌ను, జగిత్యాల మండ లం తిప్పన్నపేట, దండేపల్లి మండలంలోని ద్వారకానగర్‌లో ఇంటిముందర పార్కు చేసిన రెండు బైక్‌లను దొంగతనానికి పాల్పడ్డారు. దొంగిలించిన బైక్‌లను తమ ఇంటి వద్ద దాచి పెట్టినట్లు నిందితులు ఒప్పుకున్నారు. జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన భారతపు పెద్దిరాజం బైక్ అపహరించడంతో జగిత్యాల రూరల్‌స్టేషన్‌లో బాధితుడు జనవరిలో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసు లు జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా ఆదివారం తిప్పన్నపేట గ్రామ శివారులో కారులో వస్తున్న ఐదుగురు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు పట్టుబడ్డారు. నిందితులను పట్టుకున్న రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సధాకర్, కానిస్టేబుల్‌లు శ్రీనివాస్, గంగాధర్, రాహుల్, ఉమర్, మోహన్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

కడుపు నొప్పి భరించలేక వృద్ధుడి ఆత్మహత్య


అమరగొండ వీరయ్య(ఫైల్)

సైదాపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మం డలంలోని వెన్కేపల్లి గ్రామానికి చెందిన అమరగొండ వీరయ్య (75) అనే వృద్ధుడు కడుపునొప్పి భరించలేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వీరయ్య-రాజమ్మ దంపతులు ఓ ఇంటిలో ఉంటున్నారు. శనివారం రాజమ్మ ఐనవోలు జాతరకు వెళ్లడంతో ఇంట్లో వీరయ్య ఒక్కడే ఉన్నాడు. వీరయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం సాయంత్రం పెద్ద కుమారుడు అమరగొండ రాజయ్య కథ చెప్పేందుకు వేరే ఊరికి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం సుమారు 9 గంటల ప్రాంతంలో చిన్న కుమారుడు మల్లేష్ తన తండ్రి వీరయ్య వద్దకు వెళ్లి అతడు భోజనం చేసే వరకు ఉండి తన ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం అమరగొండ మల్లేష్ పాలు ఇచ్చేందుకు తనతండ్రి వద్దకు వచ్చి ఇంట్లో చూడగా తన తండ్రి కనిపించలేదు. దాంతో చుట్టుపక్కల వాళ్లను అడుగగా తెలియదని చెప్పారు. చుట్టుపక్కల, బావులలో వెతుకగా అమర గొండ కొమురయ్య చేదబావిలో శవమై కనిపించినట్లు తెలిపారు. తన తండ్రి అమరగొండ వీరయ్యకు కొంతకాలంగా కడుపు నొప్పి ఉన్నదని, ఈ మధ్యనే ఆస్పత్రిలో చూపించగా ఆపరేషన్ చేయాలని డాక్టర్ చెప్పాడని మృతుడి చిన్న కుమారుడు మల్లేష్ తెలిపాడు. కడుపు నొప్పి భరించలేక రాత్రి ఎవరు లేని సమయంలో బావిలో దూకి ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడని మృతుడి చిన్న కుమారుడు అమరగొండ మల్లేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

మామ లైంగికంగా వేధిస్తున్నాడని కోడలు నిరసన

- తల్లిదండ్రులు, కొడుకుతో కలిసి బైఠాయింపు

మంథని, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కోడలును కన్న కూతురిలా చూసుకోవాల్సిన మామ లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని పెద్దపల్లి జిల్లా మంథని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం కోడలు నిరసన వ్యక్తం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన యువతికి నాలుగేళ్ల క్రితం పోచమ్మవాడకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కుమారుడు ఉండగా ప్రస్తుతం యువతి ఏడు నెలల గర్భవతి. కాగా మామ తనను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని, భర్త సైతం తండ్రి చెప్పినట్లు సహకరించాలంటున్నాడని ఆరోపణలు చేసింది. అదనపు కట్నం కోసం మామ, అత్త, భర్త వేధింపులకు గురి చేయడంతోపాటు గత నెల 12న ఇంట్లో నుంచి గెట్టివేయగా మంథని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు పోలీసు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. స్టేషన్‌లో ఫిర్యాదు తర్వాత తాను ఖమ్మంలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లినట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం భర్త తన సెల్‌ఫోన్‌కు ఓ అమ్మాయి ఫొటోను పంపి ఆమెను పెండ్లి చేసుకుంటున్నానని, నీతో, నీకు పుట్టిన పిల్లలతో నాకు సంబంధం లేదని చెప్పినట్లు పేర్కొంది. దీంతో ఆదివారం మంథనికి వచ్చిన యువతి తల్లిదండ్రులు, కొడుకుతో కలిసి బైఠాయించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆమెను, కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ రమేష్‌ను వివరణ కోరగా గత నెల 12న అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారన్నారు. ఆమె ఖమ్మంకు వెళ్లడంతో కౌన్సెలింగ్ పిలిచినా రాలేదని పేర్కొన్నారు. మామ, భర్త లైంగిక వేధింపులపై ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్లు



చొప్పదండి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రహదారిపై ఎక్కడైనా ప్రమాదం జరగగానే మనకు వెంటనే గుర్తుకు వచ్చేది 108 టోల్‌ఫ్రీ నంబర్. 108కు ఫోన్ చేయగానే అంబులెన్స్ వచ్చి ప్రమాద బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్తుంది, ఆపదలో సహాయపడుతుంది. ఇదే విధంగా పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు 100నంబర్‌కు డయల్‌చేసి ఫిర్యాదు చేస్తాం. ఇవన్నీ అత్యవసర సమయంలో మనకు గుర్తుకు వచ్చే నంబర్లు. ఇదే విధంగా ఇతర అనేక రకాల సేవలకు వివిధ నంబర్లు ఉన్నాయి. అత్యవసరంలో టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయగానే సేవలు అందుబాటులోకి వస్తాయి, సమస్యలు పరిష్కారం అవుతాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అనేక సేవల కోసం ఉన్న టోల్‌ఫ్రీ నంబర్ల వివరాలు మీ కోసం...

అగ్నిమాపక సేవల కోసం 101

అగ్నిప్రమాదాలు సంబవించినప్పుడు ఫైరింజన్ కోసం 101 నంబర్‌కు ఫోన్ చేస్తే ప్రమాద స్థలానికి ఫైరింజన్‌ను పంపిస్తారు.

సంచార వైద్యం కోసం 104

రైతు మంగిటే పశువుల వైద్యానికి 104 అంబులెన్స్ వాహనం సంచార వైద్యశాలగా ఉపయోగపడుతుంది.

రైల్వే సమస్యల కోసం 139

రైలులో ప్రయాణించేటప్పుడు, ఇతర సమస్యల కోసం 139 నంబర్‌కు ఫోన్ చేస్తే అధికారులు సమస్యలను పరిష్కరిస్తారు.

టెలికాం సేవల కోసం 198

దేశవ్యాప్తంగా మొబైల్ నెట్‌వర్కింగ్ సేవలో అంతరాయం ఏర్పడిన, వినియోగదారుల సమస్యలు, సందేహాలే తీర్చడానికి ఈ నంబర్ ఉపయోగపడుతుంది.

ఆపదలో ఉన్న మహిళల కోసం 1091

ఈ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఆపదలో ఉన్న, వేధింపులకు గురైన మహిళలు సహాయం పొందవచ్చు.

పిల్లలను వేధిస్తే, బాల కార్మికులను గుర్తిస్తే 1098

6 నుంచి 14సంవత్సరాల పిల్లలు వేధింపులకు గురైనా, బాలకార్మికులను గుర్తించినా 1098 నంబర్‌కు కాల్‌చేసి సమాచారం అందిస్తే అధికారులు వారిని చేరదీస్తారు.

ఓటరు నమోదు, తదితర సమస్యల పరిష్కారానికి 1950

ఎన్నికలు, ఓటర్ల జాబితాలో వ్యక్తిగత సమాచారం, ఓటింగ్ తేదీలు, పోలింగ్‌స్టేషన్ వివరాలు తెలుసుకోవచ్చు. ఫిర్యాదుల పరిష్కారానికి కాల్ చేయవచ్చు.

మీ సేవలో సమాచారం, సమస్యల పరిష్కారం 1100

ఈ టోల్ ఫ్రీ నంబర్‌ను మీసేవా కాల్ సెంటర్‌గా ఉపయోగిస్తారు. రాష్ట్రంలోని ప్రజలు ఫిర్యాదులు, సూచనల కోసం ఈ నంబర్‌ను ఉపయోగించవచ్చు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912

విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు ఇతర సమస్యలు ఎదురైతే ఈ నంబర్‌కు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చు.

వినియోగదారుల సేవల కోసం జాతీయ హెల్ప్‌లైన్ 1915

వినియోగదారులు ఏదైనా ఉత్పత్తి, సేవపై సులభంగా ఫిర్యాదు చేయడానికి, ఫిర్యాదులను ట్రాక్ చేయడానికి ఈ టోల్ ఫ్రీ నంబర్ వీలు కల్పిసుంది.

వ్యవసాయ సమాచారం, సమస్యలపై కిసాన్ కాల్ సెంటర్ 1800-1801551

వ్యవసాయంలో సలహాలు, సూచనలు కోసం రైతులు టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చు. వాతావరణ వివరాలను సైతం తెలుసుకోవచ్చు.

మహిళల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ 181

గృహహింస వరకట్న వేధింపులు, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు వంటి పరిస్థితుల్లో ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు. మహిళలు అందుబాటులో ఉన్న సహాయ సేవలు, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల గురించి తెలుసుకోవచ్చు.

ఉపాధి హామీ పనులలో సమస్యలు పరిష్కారం కోసం 1800-2001001

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సమస్యలు, వేతనాల కోసం కూలీలు ఈ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930

సైబర్ నేరగాళ్లకు అడ్డుగట్ట వేయడానికి కేంద్ర ప్రభుత్వం 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

టీఎస్ఆర్‌టీసీ సేవల కోసం 040-69440000

బస్సు ప్రయాణంతో పాటు ఇతర సమస్యలకు ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే సంబంధిత అధికారులకు సమస్య చేరి దాని పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



కనుకులగిద్దె గ్రామంలో సాగు వివరాలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్న యువ రైతు

సోషల్ మీడియా సాయంతో వ్యవసాయం

- సామాజిక మాధ్యమాలను అనుసరిస్తున్న యువ రైతులు
- ఆధునిక పద్ధతుల్లో సాగుతో అధిక దిగుబడులు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా యువ రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. గ్రామాల్లో యువ రైతులు సామాజిక మాధ్యమాలను ఫాలో అవుతున్నారు. వ్యవసాయానికి సంబంధించి కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు. పంటల సాగులో కొత్త పుంతలు తొక్కుతున్నారు. ఆధునిక పద్దతులు ఏవి.. అధిక దిగుబడులు ఎలా సాధించాలి.. ఏ సీజన్లలో ఏ కూరగాయాలు పండించాలి.. ఏ కాలంలో విత్తనాలు వేసుకోవాలి, పంట వివిధ దశల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలేంటి.. సాగులో యంత్రాల వినియోగం ఎలా..మార్కెట్లో వేటికి డిమాండ్ ఉంటుంది.. తదితర విషయాలను యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకొని ఆచరణలో పెడుతున్నారు. అధిక దిగుబడులను సాధిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు.



జూపాక గ్రామంలో సాగు పనుల వివరాలను ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేస్తున్న యువ రైతు

● వీడియోలు, పోస్టుల ద్వారా కొత్త విషయాలు

వివిధ రాష్ట్రాల్లో రైతులు సాగు చేస్తున్న కూరగాయలు, ఇతర పంటలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులను సామాజిక మాధ్యమాలైన యూట్యూబ్ వీడియోలు, ఫేస్‌బుక్‌లో పోస్టులు పెడుతున్నారు. వాటిని ఫాలో అవుతూ కొత్త విషయాలను రైతులు తెలుసుకుంటున్నారు. తమకు అవసరమైన సమాచారాన్ని వెతికి సేకరించుకుంటున్నారు. వాటిపై అవగాహన పెంచుకుని ఆచరణలో పెడుతున్నారు. వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వినియోగాన్ని తెలుసుకుంటున్నారు. కలుపు తీసే యంతా్రలు, క్రిమిసంహారక మందులు చల్లే డ్రోన్లు, పొలం దున్నేవి, పంటలు కోసే యంత్రాల గురించి తెలుసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన రైతుల వీడియోలను స్థానిక రైతులు చూస్తూ కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు.

సోషల్ మీడియా ద్వారా కొత్త విషయాలు తెలుసుకోవచ్చు

-జొంగోని అనిల్, యువ రైతు, జూపాక



నేను చాలా కాలంగా సోషల్ మీడియా ఫాలో అవుతూ పంటల సాగులో కొత్త విషయాలను తెలుసుకుంటున్నాను. యూట్యూబ్‌లో వివిధ రకాల సాగు పనులు, మెళవకులు తెలుసుకుంటున్నాను. వాటిని అనుసరిస్తున్నాను. వ్యవసాయంలో స్మార్ట్‌ఫోన్ బాగా ఉపయోగపడుతోంది. పాడి గేదెల పెంపకం, అధిక పాల ఉత్పత్తికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన వీడియోలను చూసి ఆచరిస్తున్నాను.

మొదట్లో ఇబ్బంది పడ్డాను..

-బొల్లవేణి శ్రావణ్‌కుమార్, యువ రైతు, కందుగుల



వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు తెలియక మొదట్లో చాలా ఇబ్బంది పడ్డాను. నేను అందరి లాగా పంటలను సాగు చేసేవాడిని. ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్, వాట్సాప్ గ్రూప్‌లలో సాగుకు సంబంధించిన వీడియోల ద్వారా పలు విషయాలు తెలుసుకొని సాగు పనులు చేస్తున్నాను. నాకు తెలిసిన వారికి కూడా పంట సాగు వివరాలను తెలియజేస్తున్నా. కొత్త మెళకువలతో సాగు చేసిన రైతుల ఫోన్ నంబర్లు తీసుకొని వారితో మాట్లాడుతున్నాను. వారి సూచనలు, సలహాలతో పంటలు సాగు చేస్తూ దిగుబడి పొందుతున్నాను.

కొండగట్టు క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలి

- ఎమ్మెల్సీ కవిత

- అంజన్న సన్నిధిలో పూజలు



కొండగట్టులో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కవిత

మల్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొండగట్టు అంజనేయస్వామి క్షేత్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అభివృద్ధి చేయాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. ఆలయ అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలతో ప్రణాళిక రూపొందించి అమలుకు కృషి చేసిందన్నారు. ప్రభుత్వం మారినందన అభివృద్ధి ఆగిపోకుండా గత ప్రణాళిక అమలు చేయాలని లేకుంటే అంత కన్నా మెరుగైన ప్రణాళికతో కాంగ్రెస్ ప్రభుత్వం దేవస్థానం అభివృద్ధి చేయాలని ఆమె అన్నారు. ఆదివారం ఎమ్మెల్సీ కవిత కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొండగట్టుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తూంటారని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొండగట్టు అభివృద్ధికి మెట్లదారి, కోనేరు, షెడ్లు, దీక్ష విరమణ మండపం పనులు చేపట్టిందన్నారు. రూ.25 కోట్లతో వరదకాలువ నుంచి నీటిని తరలించి కొండపై శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులను వచ్చే హనుమాన్ జయంతిలోగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కొండగట్టు ఘాట్ రోడ్డు అభివృద్ధి పనులపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరిస్తోందని కవిత ఆరోపించారు. ఎమ్మెల్సీ వెంట మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీలు రామ్మోహన్‌రావు, ప్రశాంతి, విండో చైర్మన్ సాగర్‌రావు, బద్దం తిరుపతిరెడ్డి, కొంక నర్సయ్య, కోటేశ్వర్‌రావు, సురేందర్ ఉన్నారు.

'కులగణనలో బీసీ జనాభా తగ్గడం పెద్ద కుట్ర'

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో బీసీ జనాభా తగ్గడం వెనక పెద్ద కుట్ర జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీసీ భవనంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పర్శహన్మాండ్లు మాట్లాడారు. బీసీ కులగణన బీసీలకు అమృతం అవుతుందని అనుకున్నామని కాని అసెంబ్లీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పెట్టిన కులగణన లెక్కలు, ఆయన మాట్లాడిన తీరును బట్టి చూస్తే బీసీ కులగణన అనేది బూడిదలో పోసిన పన్నీరు అయిందన్నారు. 2014లో బీసీల జనాభా 51 శాతం ఉంటే 2024 సంవత్సరంలో 46 శాతానికి తగ్గడం వెనకాల పెద్ద కుట్ర దాగి ఉందని అనుమానాలను వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

- భారీగా తరలి వచ్చిన భక్తులు



కల్యాణానికి భారీ సంఖ్యలో హాజరైన భక్తులు

బీర్‌పూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కల్యాణ వేడుకలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులను శావలో ఆలయం చుట్టు ప్రదక్షణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వేర్వేరు సమయాల్లో స్వామి వారిని దర్శించుకున్నారు. కల్యాణ వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

ఎస్సై కుమారస్వామి ఆధ్వర్యంలో పోలీసులు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కల్యాణ వేడుకల్లో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావు, కొల్వాయి సింగిల్‌విండో చైర్మన్ నవీన్‌రావ్, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మాజీ వైస్ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు పాత పద్మ రమేష్, ఆలయ మాజీ చైర్మన్‌లు ఎనగంటి సామ్రాట్, నేరెల్ల సుమన్‌గౌడ్, గోనె రమణ రావు , మాజీ జడ్పీటీసీ సభ్యులు ముప్పాల జలజ, కొల్మూల రమణ, ఆల య ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు ఒద్దిపర్తి పెద్ద సంతోష్, మదు కుమార్, చిన్న సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యారంగ, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తా

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

హుజూరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యారంగంతో పాటు నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలో ఆత్మీయ సమ్మేళన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి 55వేల నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యూనివర్సిటీలకు తగిన నిధులిచ్చారన్నారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దన్నారు. సమావేశంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, మహిళా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సత్యప్రసన్నరెడ్డి, కౌరు సుగుణాకర్‌రెడ్డి, శంకర్, బాబు, కిరణ్‌కుమార్, పుష్పలత, రాహుల్, రాజు, లావణ్య, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్, రత్నం, రాజిరెడ్డి పాల్గొన్నారు.

వాకర్స్‌ను ఓట్లు అభ్యర్థించిన ఎమ్మెల్సీ అభ్యర్థులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్య ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి ఆదివారం ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన పోరాడిన పార్టీ అభ్యర్థులను ఆదరించాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తే ఏమీ చేయలేదనే భావన ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఉందని, పట్టభద్రులు, విద్యారంగ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలకోసం పోరాడింది బీజేపీ మాత్రమేనని అన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు చూపుతున్న ఆదరణ, విశ్వాసాన్ని మరింత పెంచుకునే ప్రయత్నం చేస్తామన్నారు. మొదటి ప్రాధాన్య ఓటును బీజేపీ అభ్యర్థులకు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ వై సునీల్‌రావు, వైద రామాను, బండ రమణారెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, కొండాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

పట్టభద్రులకు బాసటగా నిలిచేందుకే పోటీ

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను సన్మానిస్తున్న పట్టభద్రులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, నిరుద్యోగ పట్టభద్రులకు బాసటగా నిలిచేందుకే తాను ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఆదివారం హుజూరాబాద్, జమ్మికుంటలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులకు అనేక సమస్యలు ఉన్నాయని, విద్యా వ్యాపారం చేసే వ్యక్తులకు వారి సమస్యలపై అవగాహన లేదన్నారు. విద్యా వ్యాపారాన్ని చేస్తున్న వ్యక్తి రాజకీయాల్లోకి వచ్చి పట్టభద్రుల గురించి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. తనకు విద్యారంగ ప్రొఫెసర్‌గా పట్టభద్రుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. యువత, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తునన్నారు. హుజూరాబాద్, జమ్మికుంటలోని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ మద్దతు తెలపడం అభినందనీయమన్నారు.

నేటితో ముగియనున్న ఎమ్మెల్సీ నామినేషన్లు

- రేపు పరిశీలన, 13న ఉపసంహరణ

- 27న పోలింగ్... మార్చి 3న ఓట్ల లెక్కింపు

- భారీ ర్యాలీలకు అభ్యర్థుల సన్నాహాలు

కరీంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ గడువు సోమవారం ముగియనున్నది. ఈ నెల 11న నామినేషన్లను పరిశీలించి అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీ తీవ్రంగా ఉంది. ఓటర్ల నమోదు కార్యక్రమం నుంచే పోటాపోటీగా ఓటర్ల నమోదు చేయించుకోవడంతోపాటు ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈనెల 3 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా ఇప్పటి వరకు 58 మంది అభ్యర్థులు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లను దాఖలు చేశారు. వీరిలో 49 మంది పట్టభద్రుల స్థానానికి, తొమ్మిది మంది ఉపాధ్యాయ స్థానానికి నామినేషన్లను వేశారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగియనుండడంతో చివరి రోజున పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేస్తారని భావించిన అధికార యంత్రాంగం కలెక్టరేట్ వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది. చివరిరోజు పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డితోపాటు మరికొందరు అభ్యర్థులు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కూడా భారీ ర్యాలీలు నిర్వహించి నామినేషన్లను దాఖలు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

కుందనపల్లి టు ఖమ్మం

(5వ పేజీ తరువాయి)

రోడ్డుపై పడుతున్నది. బూడిద గాలికి లేచి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర లారీలు, వ్యాన్లు, బస్సు డ్రైవర్ల కళ్లలో పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు అదుపు తప్పి కిందపడడంతో పలువురు గాయాలపాలయ్యారు. ఓవర్‌లోడ్‌తో బూడిద వాహనాలన్నీ రాజీవ్ రహదారి మీదుగా వెళుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు అందడం వల్లనే పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. రోజుకు 80 నుంచి 100 లారీల వరకు ఖమ్మం, తదితర ప్రాంతాలకు బూడిద తరలుతున్నది. ఓవర్ లోడ్‌తో వెళుతున్న వాహనాలు వేగంగా వెళుతున్న కారణంగా రోడ్డుపై విపరీతంగా బూడిద రాలుతున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికా రులు స్పందించి ఓవర్ లోడ్‌ను నియంత్రించడంతో పాటు రోడ్డుపై బూడిద పడకుండా చూడాలని ప్రతిపక్ష పార్టీల నాయకులతో పాటు, ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభమైన సమ్మక్క సారలమ్మ మొక్కులు


ఈసాలతక్కళ్లపల్లిలో అమ్మవార్ల గద్దెలు

పాలకుర్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఈసాలతక్కళ్లపల్లి శివారులోని సమ్మక్క సారలమ్మల గద్దెల వద్ద వనదేవతలకు భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. మండలం పరిధిలోని రాజాపూర్, వేమునూర్ కుక్కలగూడూర్ గ్రామాల్లో ఉన్న తల్లుల గద్దెల వద్ద భక్తులు ఆదివారం, బుధవారం రోజుల్లో అమ్మవారి గద్దెలను దర్శించుకోవడంతోపాటు తమతమ ఇండ్లల్లో సైతం కోళ్లు, కొబ్బరి కాయలతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆయా రోజుల్లో గ్రామాల్లోని చికిన్ సెంటర్లు, కిరాణ దుకాణాలు సందడిగా మారుతున్నాయి.

తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రెడ్డి సామాజిక వర్గంపై తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని గోదావరిఖని రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డికి సంఘం అధ్యక్షుడు ఈద జగన్మోహన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి దేవేందర్‌రెడ్డి, కోశాధికారి చందుపట్ల తిరుపతి రెడ్డి పిటిషన్ అందజేశారు. తీన్మార్ మల్లన్న బాధ్యతాయుతమైన పదవిలో ఉండి రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు చింతల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కంకణాల ముకుందరెడ్డి, కాసర్ల సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, సాయికృష్ణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం


మృతుడి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాఫర్ ఖాన్‌పేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసిన మిట్టపల్లి సదేశ్వర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మృతుడి కుటుంబానికి పీఆర్టీయూ సంక్షేమ నిధి నుంచి జిల్లా అధ్యక్షుడు కర్రు సురేష్ లక్ష రూపాయల చెక్కును ఆదివారం అందజేశారు. పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గండు కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు ముంజాల హరికృష్ణగౌడ్, నాయకులు అనుముల పోచయ్య, ఆకుల రమేష్, పందిపెల్లి సదయ్య, గుండె కూచయ్య, మోత్కూరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కర్రె సంజీవరెడ్డిని రామునిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు ఆదివారం సన్మానించారు. నాయకులు ఇగురం రామస్వామి, కొమ్మిడి కుమార్ రెడ్డి, సమ్మిరెడ్డి, నర్సింగోజు రమేష్, శేఖర్, మెంగని కుమార్ తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

పెద్దపల్లి రూరల్ , ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఆదివారం నిమ్మనపల్లిలో గల పల్లవి పాఠశాలలో స్పోర్ట్స్ అకాడమీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు అంతే ముఖ్యమన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఎల్.రాజయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్, మాజీ కౌన్సిలర్లు మల్లయ్య, నాయకులు శ్రీనివాస్, సురేష్‌గౌడ్, పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి, ప్రధానోపాధ్యాయులు వాణి పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం



సుద్దాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 9: (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలను అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుద్దాల గ్రామానికి చెందిన అవిరినేని కుటుంబ సభ్యులు ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామానికి చెందిన డాక్టర్ శ్రీకాంత్ రావు, దివ్య రావు, కుమార్ తదితరులు సొంత గ్రామానికి, ప్రజలకు సేవ చేయాలని ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాష్‌రావు, శ్రీనివాసరావు, చందర్‌రావు, గోపాల్ రావు, శ్రీలత, రాధమ్మ, సుజాత సాగర్, తిరుపతిరావు, సంపత్, ప్రవీణ్ శ్యామల భారతి, రాధిక కోట కర్ణాకర్, నేరేళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియామకం

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రామగుండం నియోజకవర్గ అధ్యక్షుడిగా మానుపాటి స్వామిని నియమించినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా సార్ల తిరుపతి, కోశాధికారిగా మానుపాటి శివ, ఉపాధ్యక్షులుగా రేవెల్లి కొమురయ్య, సహాయ కార్యదర్శిగా కర్ర జంపయ్య, ప్రచార కార్యదర్శిగా రేవెల్లి ఓదెలును ఎన్నుకున్నారు.

వరికి మొగి పురుగు

● అన్నదాతల్లో దిగులు


మొగి పురుగు నివారణకు మందు పిచికారి చేస్తున్న రైతు

ఓదెల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటనతో సన్న రకం వరి సాగు పెరిగింది. ముందస్తుగా డిసెంబరులో వేసిన సన్న రకాల వరి వాతావరణ మార్పు వల్ల మొగిపురుగు అధికమై పచ్చదనాన్ని దెబ్బతీశాయి. డిసెంబర్ చివరి వారం, జనవరి మొదటి వారం నుంచి దొడ్డు,సన్న రకాల సాగు చేసినప్పటికీ రెండింటికి మొగి పురుగు, ఎండు తెగులు సోకాయి. నివారణ కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

మండలంలో సన్న రకం వరి పంటలు 15 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగుచేయగా, దొడ్డు రకం 4200 ఎకరాల్లో వేశారు. గతంలో కంటే 1800 ఎకరాల మేరకు దొడ్డురకం తగ్గగా, వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో సన్నరకం వరి సాగు పెరిగింది. ముందస్తుగా సన్న రకాల వరి పంటలు సాగు చేయడంతో ప్రారంభం నుంచే మొగి పురుగు, ఎండు తెగులు, అగ్గి తెగులు అధికమై వరి పంటలు ఎదుగుదలకు నోచుకోవడం లేదు. దీంతో పెస్టిసైడ్ షాపుల్లో యజమానులు చెప్పిన పురుగు నివారణ మందులను పిచికారీ చేస్తున్నారు. దీంతో ఒక్కో ఎకరానికి రూ.3500 చొప్పున రైతులు ఖర్చు చేస్తున్నా పురుగు ఉధృతి తగ్గడం లేదు. దీంతో వరి పంటలో పురుగు అధికం కావడం వల్ల కొంగల విహారం ఎక్కువై వరి పంటలను దెబ్బతీస్తు న్నాయి. ప్రస్తుతం వరి పంటలు పొట్ట దశలో ఉండడంతో పురుగుల కోసం కొంగలు తొక్కుతుండడంతో చేతికంది వచ్చిన వరి విరిగిపోయి ధాన్యం దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

● వెంట వెంటనే పంటల సాగు

ధాన్యం దిగుబడి కోసం రైతులు పోటాపోటీగా సాగు చేస్తూ సారవంతమైన భూముల్లో పెస్టిసైడ్ మందులను నింపుతున్నారు. వరి పంటల కోత పూర్తి తర్వాత భూములను ఎండనీయకుండా వెంట, వెంటనే నారు మళ్లను సిద్ధం చేసి, వరి నాట్ల కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో భూమి పొరల్లో ఉన్న చీడ పురుగులు వృద్ధి చెంది వరికి రకరకాల రోగాలకు కారణమవుతున్నాయి. వరి పంటల కోత పూర్తి తర్వాత వరి కొయ్యలను కాల్చడంతో భూముల్లో రోగ నిరోధక శక్తి తగ్గి పంటకు కీడు చేసే పురుగులు అధికమవుతున్నాయి.

● పాత పద్ధతులే పంటలకు రక్షణ

పాత పద్ధతిలో పంట కోత పూర్తిచేసిన తర్వాత సేంద్రియ ఎరువులు పోసి, భూములను నెర్రలు వారే విధంగా దున్నేవారు. దున్నిన భూముల్లో అడుగు భాగం వరకు ఎండ సోకి భూముల్లో రోగ నిరోధక శక్తి పెరిగి సారవంతంగా అయ్యేవి. ప్రస్తుతం నాటి పద్ధతులు పాటిస్తే పంటలకు రక్షణ కలుగుతుందని అధికారులు చెబుతున్నారు.

మూడుసార్లు పిచికారి చేసిన

- చింతం రాజయ్య, రైతు ఓదెల



ఎకరం భూమిలో వరి పంట సాగు చేసిన. నాట్లు వేసిన తర్వాత మొగి పురుగు అధికం కావడంతో రూ.18 వేలు ఖర్చు చేసి మూడుసారు పురుగు మందులు పిచికారి చేసిన, అయినా పురుగు తగ్గలేదు. ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో ఇప్పుడి ప్పుడే పొలంలో కొంత మార్పు వస్తుంది.

రైతులు రక్షణ పద్ధతులు పాటించాలి

- భాస్కర్ వ్యవసాయ అభివృద్ధి అధికారి



గతంలో ఉన్న పద్ధతుల తోపాటు రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి. వరి ప్రారంభ దశలో పటేరా గుళికలు చల్లిన తరువాత అయినా మార్పు లేకుంటే కార్ట్ ప్ హైడ్రో క్లోరైడ్ మందును పిచికారి చేయాలి. అనంతరం పురుగు ఉధృతిని బట్టి చివరికి కోరాజిన్ స్ప్రే చేస్తే పంటలకు మంచి ఫలితాలు ఇస్తాయి. .

న్యూస్ బాక్స్

బీజేపీ గెలుపుపై సంబరాలు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 9: (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ఘన విజ యం సాధించడం ప్రధాని నరేంద్ర మోదీ పాలన పట్ల ప్రజా ఆమోదానికి నిదర్శనమని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ మహేష్ అన్నారు. ఢిల్లీలో బీజేపీ విజయాన్ని పురస్కరించుకుని ఆదివారం గర్రెపల్లి స్టేజీ వద్ద బాణసంచా పేల్చి స్వీట్లు పంచి సంబ రాలు జరుపుకున్నారు. నాయకులు గున్నాల ప్రవీణ్, వంగల ప్రవీణ్, కుందేళ్ళ సతీష్, అనిల్, మహేష్, రాజు,సంతోష్, మల్లేశం పాల్గొన్నారు.

దూర విద్య అధ్యయన కేంద్రాన్ని కొనసాగించాలి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎస్‌డీఎల్‌సీఈ దూరవిద్య అధ్యయన కేంద్రాన్ని పాతపద్ధతిలోనే కొనసాగించాలని కేయూ వైస్‌ఛాన్సలర్, రిజిస్ట్రార్‌లను ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ ఒక ప్రకటనలో కోరారు. 26 ఏళ్లకు పైగా కొనసాగుతున్న కేంద్రాన్ని యూజీసీ నిర్ణయంతో రద్దు చేయడం సరికాదన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని 21 సెంటర్లలో పనిచేస్తున్న దాదాపు 50 మంది కౌన్సిలర్లు, సిబ్బంది ఉపాధి కోల్పోయి వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని పేర్కొ న్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు


కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్‌లో పూర్వ విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని తిలక్‌నగర్‌లోని కాకతీయ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన ఏడవ తరగతి 1990-91 విద్యాసంవత్సరం బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం మార్కండేయకాలనీలో ఘనంగా నిర్వహించారు. నాటి రోజులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. చదువు చెప్పిన గురువులు జగదీశ్వర్, రాంచందర్, జనార్దన్, మంజుల, మాణిక్యం, రవికిరణ్‌లను సన్మానించారు. పూర్వవిద్యార్థులు ముష్కి శ్రీను, బండి సతీష్, లెక్కల వీరేశం, ప్రకాష్, రవి, రాజ్‌కుమార్, జితేందర్, లక్ష్మీ, రమాదేవి, శ్రీలత, రాజకుమారి, ప్రసన్న, సునీత, సుజాత పాల్గొన్నారు

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2004-2005లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఎక్కడెక్కడో స్థిరపడిన సుమారు 105మంది పాల్గొన్నారు. ఒకరికొకరు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పాఠశాలలో మొక్కను నాటారు. ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, రఘుపతిరావు, తిరుపతి, అజీమ్, లక్ష్మీకాంతం, రఘు, శోభారాణి, అరుణకుమారి, వెంకటేశ్వర్లు, మహేందర్‌రెడ్డి, శ్యామ్‌లను సన్మానించారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): జూలపల్లిలోని మూర్తి విద్యాలయంలో 1994-2000 మధ్య విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు పద్మశాలి సేవాసంఘం భవనంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. విద్యాభ్యాసం చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యాలయం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుంట వెంకటేశం, బండి శ్రీనివాస్, పిల్లి రాజేశం, శేషం రమేష్‌చంద్రభార్గవ్, సముద్రాల వేణుగోపాలచార్యులు, కోల శ్రీనివాస్, చొప్పరి తిరుపతి, అబ్బిడి రాంరెడ్డి, తీగల మధునయ్య, చిర్రం పోచమల్లు, పెరటి అశోక్‌రెడ్డి, బాలూరి పూర్ణచందర్, రమేష్, శంకర్, రాజకుమారి, కొలిపాక లక్ష్మి, బి.రాజలింగు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఖనిలో కాకతీయ విద్యానికేతన్, శారదా విద్యానికేతన్ పాఠశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): శారదా విద్యానికేతన్ పాఠశాలలో 2002-03లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం భవాని గార్డెన్స్‌లో జరిగింది. 12 ఏళ్ల తర్వాత అంతా ఒకచోట చేరిన వారు ఉల్లాసంగా గడిపారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల వ్యవస్థాపకుడు సుభాష్ చంద్రబోస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు సంపత్‌రెడ్డి, ప్రకాష్, రవి, శ్రీకాంత్, రజితచ శ్వేత, రమ, స్వర్ణలత, లావణ్య, రవీందర్, సాయిబాబు, అశోక్, మాధవి పాల్గొన్నారు..

అభివృద్ధిని ఓర్వలేక అసత్య ఆరోపణలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆరో పించారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న మాజీ ఎమ్మెల్యేలు సోమారపు సత్యనారాయణ, కోరుకంటి చందర్ నియోజకవర్గ అభివృద్ధికి తట్టెడు మట్టి కూడా తీయలేదని ఆరోపించారు. మున్సిపల్ టీ జంక్షన్ నుంచి ఫైవింక్లయిన్ చౌరస్తా వరకు రోడ్డు వేయించలేదని, చందర్ ఐదేళ్ల అధికారంలో ఉన్నా సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులను ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. రామగుండాన్ని అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కంకణం కట్టుకున్నారని, రూ.14కోట్లతో చౌరస్తా, లక్ష్మీనగర్‌లోని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్టు, ఈనెల 24న టెండర్ బిడ్ కూడా ఓపెన్ అవుతుందన్నారు. రోడ్లను విస్తరించే క్రమంలో మక్కాన్‌సింగ్ చౌరస్తా నుంచి జీఎం ఆఫీస్, గోదావరిఖని వన్‌టౌన్ నుంచి ఫైవింక్లయిన్ వరకు విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇందిరానగర్ నుంచి సప్తగిరి కాలనీ వరకు డ్రైనేజీతోపాటు యూజీడీ, సీసీ రోడ్లను చేయిస్తున్నారని, రామగుండాన్ని వ్యాపార, మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నారన్నారు.

రాజేష్ శర్మ అనే వ్యక్తి లక్ష్మీనగర్‌లో వ్యాపారులను రెచ్చ గొడుతూ పబ్బం గడుపుకోవడానికి చూస్తున్నా డని, అతనికి 16షాపుల వరకు ఉన్నాయని, ఒక్కొక్క షాపునకు రూ.30వేల నుంచి రూ.40 వేలు వసూలు చేస్తున్నాడని, ప్రసాద్ అనే వ్యక్తి ఒక నెల కిరాయి ఇవ్వకపోతే అతని షాపునకు తాళం వేసి వేధించారని, అతనికి తామే చందాలు వేసి తెరిపించామని చెప్పారు. ఎమ్మెల్యేపై అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. నాయకులు కాల్వ లింగస్వామి, ఎండీ ముస్తాఫా, పెద్దెల్లి ప్రకాష్, గట్ల రమేష్, బొమ్మక రాజేష్, మారెల్లి రాజిరెడ్డి, యుగంధర్, మాలెం మధు, కొప్పుల శంకర్, అనుమ సత్యనారాయణ, అల్లి శంకర్, ఆడెపు దశరథం, శంకర్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


విశ్రాంత ఉద్యోగుల సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న బాబర్

జ్యోతినగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎన్టీపీసీ ద్వైపాక్షిక సంఘం(ఎన్‌బీసీ) సభ్యుడు బాబర్ సలీంపాషా హామీ ఇచ్చారు. రామగుండం ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం(రేవా), మజ్దూర్ యూనియన్ (ఐఎన్‌టియుసి) ఆదివారం పీటీఎస్ జ్యోతి ఫంక్షన్ హాల్‌లో సూపర్ మీట్ పేరుతో రిటైర్డ్ ఉద్యోగుల సమ్మేళనాన్ని నిర్వహించారు. సమావేశానికి బాబర్ సలీం పాషా, ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్ఆర్) విజయ్‌కుమార్ సిక్దర్ హాజరయ్యారు. బాబర్ మాట్లాడుతూ మెరుగైన పెన్షన్ స్కీం అమలయ్యేలా ప్రయత్నిస్తానని తెలిపారు. ఈపీఎస్ 95 పెన్షన్‌ను 7,500 రూపాయలు, డీఏతో కలిపి అమలు చేయాలని, సెల్ఫ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను బెనిఫిట్ స్కీం ప్రకారం యాజమాన్యం చెల్లించాలని, పీఆర్ఎంఎస్ వైద్యంకు సంబంధించి ఉన్న ఇబ్బందులను తొలగించాలని తీర్మానించారు. ఎన్టీపీసీ యాజమాన్యం ఇచ్చిన రేవా కార్యాలయాన్ని ప్రాంభించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆకుల రాంకిషన్ అధ్యక్షత జరిగిన సమావేశంలో రెండు రాష్ట్రాలలో వివిధ ప్రాంతాలలో ఉన్న 300 మంది రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. నట్టు ముత్యాలు, తిరుమల సురేందర్, సిహెచ్.శ్రీపతిరావు, దుర్గం నర్సయ్య, రాంనారాయణ, లాలయ్య, వెంకటేశ్వర్లు, గోపాల్‌రెడ్డి, ఎన్టీపీసీ హెచ్ఆర్ అధికారులు ప్రవీణ్ కుమార్ చౌదరి, ఆదేశ్ పాండే, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

సుల్తానాబాద్ , ఫిబ్రవరి 9: (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలలో సుల్తానాబాద్‌కు చెందిన విద్యార్థులు పతకాలు సాధించారని కోచ్ సతీష్ తెలిపారు. సరోర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగవ అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. విజ్ఞాన్ హైస్కూల్‌కు చెందిన హర్ష వర్ధన్, అభినయ్, హనీ, హరిణి, శ్రీహిత బంగారు పతకాలు సాధించారని కరాటే మాస్టర్ జి సతీష్ తెలిపారు. ఆరు బంగారు, మూడు వెండి, ఒక కాంస్య పతకం సాధించినట్టు వివరించారు.

ఎన్టీపీసీలో కార్మికులకు క్రికెట్ పోటీలు

జ్యోతినగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ ప్రాజెక్టులో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహిచారు. వివిద కాంట్రాక్టు సంస్థల కార్మిక జట్లు పాల్గొన్నాయి. లీగ్ కంనాకౌట్ పద్ధతిన జరిగిన పోటీలలో హెచ్ఈఎంఎస్ సంస్థ జట్టు విజేతగా నిలిచింది. వోల్టెక్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. విజేతలకు సీనియర్ కాంట్రాక్టర్ ఎ.బి.సి.రెడ్డి ట్రోఫీ, బహుమతులను అందజేశారు.

బ్రాస్‌బ్యాండ్ కార్యవర్గం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 9: (ఆంధ్రజ్యోతి): బ్రాస్‌బ్యాండ్ సంఘం సమావేశం జిల్లా అధ్యక్షుడు ఇ.రాజయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. పట్టణానికి చెందిన బూర్గు శ్రీకాంత్‌గౌడ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కొత్తూరి చంద్ర బాలయ్య, సమ్మయ్య, కార్యదర్శి గా యండీ జహంగీర్, సహాయ కార్యదర్శి గా మైలారం సంపత్, కోశాధికారిగా గోపాల్ గౌడ్‌లు ఎన్నికయ్యారు.

జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


అబాకస్ పోటీలో ప్రథమ బహుమతి సాధించిన శ్రీనిజ, ద్వితీయ, తృతీయ సాధించిన శ్రీసాయి వివేకానందా విద్యార్థులు

మంథని, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో రైజింగ్ నాలెడ్జ్ ఎడ్యూకేషన్ సొల్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్ వేదిక్ మ్యాథ్స్ క్యాపిటీషన్ నిర్వహించారు. ఇందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో 400కి పైగా విద్యార్థులకు పాల్గొనగా స్థానిక శ్రేష్ఠ కిడ్స్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న ఎస్. శ్రీనిజకు జిల్లా స్థాయిలో ప్రథమ, 1వ తరగతి చదువుతున్న హిమాన్షి తృతీయ బహుమతి సాధించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ సిరిపురం బిందు, ప్రిన్సిపాల్ వేల్పుల మౌనిక, టీచర్లు అభినందించారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): కాచాపూర్‌లోని శ్రీసాయి వివేకానందా విద్యార్థులు అబాకస్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు సందవేని హర్షిత్, నారగోని భాగ్యశ్రీలు జిల్లా స్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించగా వారిని అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. కరస్పాండెంట్ గోనే పర్శరాములు, శ్రీనివాస్, చందా శ్రీనివాస్, పలువురు పాల్గొన్నారు.

బహుజన చైతన్యం కోసమే జ్ఞానదీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): బహుజన, అణగారిన వర్గాల్లో చైతన్యం కోసమే పూలె, అంబేద్కర్ జ్ఞానమాల అని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కో కన్వీనర్ ఆకునూరి బాలంకుస్ పేర్కొన్నారు. ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యవంతులను చేయాలనే ఉద్దేశంతో జ్ఞానమాల కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. బొచ్చు శంకర్, కమలాకర్, ఉదయ్‌కుమార్, పేగ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు చక్రపాణి, యాదగిరి తిరుపతి, సారయ్య, పద్మశాలీ సంఘం నాయకుడు సాంబారి రాజేష్ పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని వర్గాల వారికి సమాన హక్కులు, సమన్యాయాన్ని అంబేద్కర్ ఆశించినట్టు ప్రభుత్వ న్యాయవాది మారే కిషోర్ తెలిపారు. ఆదివారం గోదావరిఖనిలో జరిగిన పూలె అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో మాట్లాడారు. సామాజిక మార్పు అనివార్యమని, అన్ని వర్గాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆర్ఎంఓ డాక్టర్ ధనాల చంద్రశేఖర్, అంబేద్కర్ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేష్, ఆలయ ఫౌండేషన్ సీఈఓ తీట్ల రమేష్‌బాబు, సభ్యులు లింగయ్య, పిడుగురాళ్ళ కిష్టయ్య, మహేందర్, నర్సింగరావు, రంగయ్య, బొందయ్య, పవన్‌కుమార్, కరీం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.